క్లుప్తంగా

బాలభవన్‌ను సందర్శించిన డిప్యూటీ ఈవో



బాలభవన్‌లో సిబ్బందితో బొబ్బిలి డిప్యూటీ ఈవో మోహన్‌రావు

రాజాం: పట్టణంలోని బాలభవన్‌ను బొబ్బిలి డిప్యూటీ ఈవో మోహన్‌రావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరుగుతున్న వేసవి శిక్షణా తరగతులను పరిశీలించారు. అక్కడికి వచ్చే చిన్నారులకు నేర్పిస్తున్న క్రాఫ్ట్ వర్క్, నృత్యం, గానం, చిత్రలేఖనంపై ఆరాతీశారు. తరగతులకు హాజరవుతున్న చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని సంస్థ డైరెక్టర్ సుంకరి రమేష్‌కు ఆయన సూచించారు.

ఔదార్యం



బాగు చేసిన ఇళ్ల వద్ద ఆనందంతో ముస్లిం సోదరులు

బొబ్బిలి: పట్టణానికి చెందిన హ్యాండ్ ఇన్ హ్యాండ్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ కె.జయబాబు ఔదార్యం చాటుకున్నారు. మండలంలోని పెంట గ్రామంలో నివశిస్తున్న ఐదు నిరుపేద ముస్లిం కుటుంబాల ఇళ్లను బాగుచేయించి, వారికి శనివారం అప్పగించారు. పాడైన వారి రేకుల ఇళ్ల దుస్థితిని ఆయా కుటుంబాల వారు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన.. ఇళ్ల మరమ్మతులు చేయించి, ఇచ్చి మానవత్వం చాటుకున్నారు. రానున్న వర్షాకాలంలో శిథిలానికి గురైన ఇళ్లల్లో ఎలా ఉండాలని భయపడ్డామని, మంచి మనసుతో తమను ఆదుకున్న జయబాబుకు కృతజ్ఞతలని ఆయా కుటుంబాల వారు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



బూరాడలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో జి.మురళీకృష్ణ హెచ్చరించారు. మండలంలోని బూరాడ, పనసలవలస గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు శనివారం చేపట్టిన ఆయన.. అక్కడి ఎరువులు, విత్తనాల నిల్వలపై ఆరాతీశారు. రికార్డులు చూసి, కాలపరిమితి చెందిన పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. వ్యవసాయాధికారులు సూచించిన వాటినే విక్రయించాలని, రైతులను మోసగిస్తే సహించేది లేదన్నారు.

నాడు–నేడు పనులు పూర్తి చేయాలి



నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

రాజాం: సకాలంలో నాడు–నేడు పనులు పూర్తి చేయాలని ఎంఈవో యాగాటి దుర్గారావు ఆదేశించారు. మండల పరిధిలోని బొద్దాం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు–నేడు పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ నాగమణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

30 యూనిట్ల రక్తం సేకరణ

బాడంగి: మండలంలోని కోడూరు గ్రామంలో షికారుగంజికి చెందిన అమ్మ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో దాతల నుంచి 38 యూనిట్ల రక్తం సేకరించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు డి.సురేష్ తెలిపారు. ఇదే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌ఐ ఆర్.జయంతి హాజరై, రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యం పోతుందన్న వంటి అపోహలు వీడాలన్నారు. రక్తదానం చేస్తే ఆరోగ్యమే తప్ప నష్టమేమీ లేదన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తం దానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయికుమార్, ఎన్.వి.ఎస్ బ్లడ్‌బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో ఉత్తమ ఫలితాలు

- ఒకే నేలలో ఒకే పంట సాగుతో అనర్థాలు
- దిగుబడి తగ్గడంతో పాటు నేల నిస్సారం
- మిశ్రమ పంటలతో ఉత్తమ ఫలితాలు
- చీడపీడల నుంచి రక్షణ, అధిక దిగుబడి సాధ్యం



రామభద్రపురంలో వరి పంటకు బదులుగా సాగులో ఉన్న ఆనప కూరగాయ పంట



వరి పండించిన పొలంలోనే వంగ పంట సాగు ఇలా..

రామభద్రపురం: ఒకే పంటను ఒకే భూమిలో ఏళ్ల తరబడి సాగు చేస్తే సమస్యలు ఎదురవుతాయి. పంటను ఆశించే చీడపీడలు అధికమవుతాయి. నేల సైతం నిస్సారంగా మారుతుంది. ఈ నేపథ్యంలో పంట మార్పిడి చేస్తే నేల సారవంతం కావడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రైతులు ఏటా సాగు చేసే పంటలనే మళ్లీ మళ్లీ వేస్తుండడంతో భూమి సారం క్రమక్రమంగా తగ్గిపోతోంది. ఈ క్రమంలో పంటకు అయ్యే ఖర్చు కూడా పెరిగిపోయి దిగుబడులు తగ్గడంతో అన్నదాతలు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. పంట మార్పిడి చేయక పోవడం కారణంగానే చీడపీడలు ఎక్కువై, పంట దిగుబడి అంతగా ఉండడం లేదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చీడపీడల నుంచి పంటను రక్షించడంతో పాటు ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు కావాలంటే పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలని సలహా ఇస్తున్నారు. కనీసం రెండు లేదా మూడేళ్లకోసారి అయినా పంట మార్పిడి చేస్తేనే చీడపీడలను అదుపులో ఉంచే అవకాశం ఉంటుందంటున్నారు. ఒకే నేలలో ఏటా వేసిన ఒకే పంట మళ్లీ వేయకుండా వేరే పంట వేస్తే నేలలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెందుతుంది. చీడపీడలు దూరమవుతాయని ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే మందులు కూడా తగ్గించుకోవచ్చు.

ఐదేళ్లుగా పంట మార్పిడి చేస్తున్నా..



నేను ప్రతీ ఏడాది వరి పంట సాగు చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయాను. ఐదేళ్లుగా పంట మార్పిడి చేస్తున్నాను. ఒక ఏడాది కూరగాయలు వేస్తే మరో ఏడాది పత్తి పంట వేస్తున్నాను. దీంతో దిగుబడులు పెరిగి లాభం వస్తోంది. మార్కెట్‌లో ధరలు స్థిరంగా ఉంటే కూరగాయల పంటలపై మంచి లాభాలు వస్తాయి. –గెద్ద జగన్నాథం, రైతు, రామభద్రపురం.

పంట మార్పిడి ప్రయోజనాలు..

- చీడపీడలను అదుపులో ఉంచవచ్చు.
- ఒక పంటను ఆశించే చీడపీడలు రెండో పంటను అంతగా ఆశించవు.
- పంట మార్పిడిలో రెండు లేదా మూడు పంటలను పండించడం వల్ల ఏదైనా ఒక పంటకు గిట్టుబాటు లేకున్నా వేరే పంటల వల్ల తగ్గిన లాభాన్ని పొందవచ్చు.
- వివిధ పంటల్లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవచ్చు.
- సస్యరక్షణకు వాడే పురుగుమందుల ఖర్చు తగ్గుతుంది.
- వేర్లు నేలలో తక్కువ లోతుకు చొచ్చుకుని పోయే పైర్లను, వేర్లు ఎక్కువ లోతుకు చొచ్చుకుని పోయే పైర్లతో పంట మార్పిడి చేయడం వల్ల భూమిలోని వివిధ పొరల్లో ఉన్న తేమ, పోషకాలు సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు.
- పత్తి వేసిన పొలంలో మిరప పంట వేస్తే లాభసాటిగా ఉంటుంది. మిరప పంట వేసిన పొలంలో పత్తి పంట సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు సాగు దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఉంటుంది.
- పంట సాగుకు ముందు నేలలో జనుము, జీలుగ, పిల్లిపెసర సాగు చేసి వాటిని అదే నేలలో కలియదున్నితే భూసారం పెరిగి చీడపీడలు దరి చేరవు.
- నులిపురుగులు ఉన్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేస్తే అవి వాటిని మరింత అభివృద్ధి చేస్తాయి.
- పంట మార్పిడిలో భాగంగా నేలంతా పూర్తిగా కప్పే వాటిని ఎంపిక చేసుకోవాలి.
- వేరుశనగ బొబ్బర్లు, పెసర, మినుము, పంటలు నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీనివల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా నివారించవచ్చు.
- వరి పంట తర్వాత పప్పుధాన్యాల పంటలను కానీ నూనెగింజల పంటలను కానీ సాగు చేస్తే వరిని తెగుళ్లు ఆశించకుండా ఉంటాయి.
- భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు ఏడాదిలో రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది.
- తేలికపాటి నేలలు, ఎర్ర, ఇసుక, తువ్వ నేలల్లో మిశ్రమ పంటలను సాగుచేసుకోవచ్చు.
- వేరుశనగ, కంది, పప్పుశనగ తదితర పంటలను సాగు చేయడం ద్వారా భూమి సారవంతమై వాతావరణ కాలుష్యం నివారించవచ్చు.

పంట మార్చితే నత్రజని స్థిరీకరణ..



పంట మార్పిడితో మొక్కల వేర్ల బుడిపెలోని రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని స్థిరీకరించి, నేలను సారవంతం చేస్తుంది. రైతులంతా ఒకే పైరు వేయడం ద్వారా చీడపీడల ఉధృతి అధికమై దిగుబడులు తగ్గడమే కాకుండా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోవచ్చు. మార్కెట్‌లో పంటకున్న డిమాండ్‌ను బట్టి పంట మార్పిడి చేసుకుంటే ధరల స్థిరీకరణ ఉంటుంది. ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. – వెంకటయ్య, ఏవో, రామభద్రపురం.

ఎమ్మెల్యే పరామర్శ



రామారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలానికి చెందిన జెడ్పీటీసీ గర్భాపు లూర్థు భర్త, మండల వైఎస్సార్ సీపీ నాయకుడు గర్భాపు రామారావును ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పరామర్శించారు. గత కొన్ని రోజులుగా ఆయన కాలు నొప్పితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. కాగాంలోని ఆయన నివాసానికి శనివారం వెళ్లి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తెర్లాం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కందుల శ్రీనివాసరావు కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే శంబంగి శనివారం కలిసి పరామర్శించారు. శ్రీనివాసరావు తండ్రి చినరామారావు శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణారావు, బాడంగి జెడ్పీటీసీ తెంటు రామారావు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



గొల్లాదిలో ప్రజలకు సూచనలిస్తున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు

బాడంగి: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని గొల్లాది, గజరాయునివలస గ్రామాల్లో దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేవారంతా.. మద్యం తాగి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, పరిమిత వేగంతో వాహనాలు నడపాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. అలాగే ఏదైనా పని మీద ఇంటి నుంచి బయటకు వెళ్తే ఇంటికి తాళం వేసుకుని వెళ్లాలని, అలాగే విలువైన వస్తువులు, నగదు బీరువాలో భద్రపరిచి, వాటి తాళాలు వెంట తీసుకునిపోవాలని తెలిపారు. చాలామంది నగదు, ఆభరణాలు ఉంచిన బీరువా తాళాలను టీవీ బల్ల మీద, బెడ్డుపైన విడిచిపెట్టి వెళ్తున్నారని, అలా వదిలేస్తే దొంగలకు దొంగతనం చేయడం సులువైపోతుందన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

రాజాం: మండలంలోని బొమ్మినాయుడువలస, గార్రాజుచీపురుపల్లి తదితర గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరిస్తూ పండించిన పంటలను ప్రకృతి వ్యవసాయం ఆర్‌టీవో హేమసుందర్, ఆర్‌టీఎల్ ప్రకాష్ కలిసి శనివారం పరిశీలించారు. ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేయడానికి ఆసక్తి చూపాలన్నారు. ప్రస్తుతం రాయితీపై ఇస్తున్న నవధాన్యాలను పొలాల్లో వేసి, మొక్కలైన తర్వాత వాటిని నేలలోనే కలియదున్నాలని తద్వారా నేల సారవంతమై అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ బి.రమాదేవి, ఐసీఆర్‌పీ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత దంతవైద్య శిబిరం

బొబ్బిలి: మండలంలోని గొంగాడవలస గ్రామంలో ఉచిత దంతవైద్య శిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు గొంగాడ శంకరరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం ఉంటుందని, దంత సమస్యలతో బాధపడే వారు శిబిరాన్ని ఆశ్రయించవచ్చన్నారు. దంతాల శుభ్రం దగ్గర నుంచి పుచ్చిపళ్లు, కదిలే పళ్లను తీయడం, దెబ్బతిన్న పళ్లకు సిమెంట్ పెట్టడం వంటివి చేయడం జరుగుతుందని, ఉచితంగా మందులు కూడా అందించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9550311249ను సంప్రదించాలని కోరారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం

బాడంగి: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నామని ప్రిన్సిపాల్ టి.రామదాసు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. బాలురుకు సంబంధించి, ఈ నెల 28వ తేదీన స్థానిక గురుకులంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు, ఈ నెల 30వ తేదీన ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం అడ్మిషన్లు తీసుకుంటున్నామని, బాలికలకు సంబంధించి, నెల్లిమర్ల గురుకులంలో ఈ నెల 29వ తేదీన ఐదో తరగతిలో ప్రవేశాలకు, ఈ నెల 31వ తేదీన ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం సీట్ల భర్తీ చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులంతా ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు

వంగర: మండలంలోని కొప్పరవలస, బంగారువలస గ్రామాల్లో శనివారం పశువైద్య శిబిరాలు నిర్వహించి, సీజనల్ వ్యాధులు సోకకుండా పశువులకు టీకాలు వేశారు. అలాగే పశువులకు సోకే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. పశువులు ఎలాంటి అనారోగ్యానికి గురైనా వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

రైతుకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యమివ్వండి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

రామభద్రపురం: రైతులకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పథకం పనులు చేసేందుకు ప్రాధాన్యమివ్వాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో త్రినాథరావుతో కలిసి ఉపాధి హామీ పథకం టీఏలు, ఎఫ్ఏలతో శనివారం సమావేశమైన ఆమె.. పంట సంజీవిని, చేపల చెరువులకు ప్రాధాన్యతనిస్తూ పనులు చేయించాలని తెలిపారు. పంట సంజీవని కుంటలు 9 మీటర్ల పొడవు, 9 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతు ఉండేలా తవ్వాలని సూచించారు. అలాగే చేపల చెరువులు 50 మీటర్ల చొప్పున పొడవు, వెడల్పులు, 2 మీటర్ల లోతు ఉండేలా తవ్వాలన్నారు. అవసరమైన రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా నేలబావులు తవ్వుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. రైతులు తమ పొలాల చుట్టూ ట్రెంచ్‌లు తవ్వుకునేందుకు, పొలాల గట్లు, హద్దుల ఏర్పాటుకు నిధులు చెల్లించనున్నామన్నారు. చెరువులలో ఇప్పటివరకు 3 నుంచి 4 అంగుళాల లోతు ఉండేలా పనులు చేసేవారని, ఇప్పుడలా కాకుండా అరమీటరు వరకు లోతు ఉండేలా తవ్వకాలు చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యత కనిపించాలన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300



వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీవో హరనాథరావు

సంతకవిటి: కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఉపాధి హామీ పనుల వేతనదారులకు ఏపీవో హరనాథరావు సూచించారు. మండల కేంద్రంలోని ఈదులవాని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉందని, వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు చల్లగా ఉన్న సమయాల్లోనే ఉపాధి పనులు చేయాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్, టెంట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి



గార్రాజుచీపురుపల్లిలో ప్రజలకు సూచనలిస్తున్న సీఐ మోహనరావు

రాజాం సిటీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎవరూ గొడవలు పడవద్దని, ప్రతిఒక్కరూ తగాదాలకు దూరంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ డి.మోహనరావు తెలిపారు. శనివారం మండల పరిధిలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలో ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు రానున్నాయని, ఆరోజు ఏ పార్టీ వారు కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ప్రతీ గ్రామంలో ప్రశాంత వాతావరణం, అందరి మధ్య సోదరభావం కనిపించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్‌ఐ వై.రవికిరణ్, తదితరులు ఉన్నారు.

అన్నదాతకు ఆర్థిక చేయూత

- రైతుల ఖాతాలో ఇన్‌పుట్ సబ్సిడీ జమ
- పంటల సాగుకు ప్రభుత్వం భరోసా
- ఆనందంలో అన్నదాతలు

ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు వివరాలు

మండలం	పంట	రైతులు	నగదు(రూ.లక్షల్లో)
భోగాపురం	వరి	32	2.494
డెంకాడ	వరి	410	17.461
నెల్లిమర్ల	వరి	3	0.236
పూసపాటిరేగ	వరి	110	5.309



వర్షాభావం కారణంగా పూసపాటిరేగలో దెబ్బతిన్న వరిపంట(ఫైల్)

పూసపాటిరేగ: బ్యాంకు ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు జమకావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలు కష్టాల పాలయ్యారు. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టింది. పంట నష్టపోయిన రైతులను గుర్తించి ఇనపుట్ సబ్సిడీ కింద నష్టపరిహారం అందించింది. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో రైతులు పంట నష్టాల నుంచి గట్టెక్కారు. గత ప్రభుత్వంలో పంట నష్టపోయిన రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటనష్ట పరిహారం పొందేందుకు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు సకాలంలో అవసరమైన ఆర్థిక సాయం అందిస్తూ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సాహిస్తోంది.

పెట్టుబడి సాయం అందింది

రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు ఎంతోగానో ఉపయోగపడింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో సాగు పనులు మొదలు పెట్టాం. పంట మదుపులకు డబ్బుల కోసం ఎదురు చూస్తున్న సమయంలో ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని ఖాతాల్లో జమ చేయడంతో అప్పుల బాధ తప్పింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ముందుంది.

– గుజ్జు సురేస్‌రెడ్డి, రైతు, కుమిలి

రైతులకు అండగా ప్రభుత్వం

గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. పంటసాగుకు పెట్టుబడి కోసం ఎదురుచూసే పరిస్థితి లేకుండా చేసింది. గతంలో వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు నష్టపోయినా, అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నా ప్రభుత్వాలు పట్టించుకొనేవి కావు. నేడు రైతుకు ఎటువంటి నష్టం జరిగినా ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకుంటోంది.

– కె.వెంకటరావు, రైతు, పూసపాటిరేగ

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పిల్లలతో కథల పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ సత్యవాణి

రామభద్రపురం: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ సత్యవాణి కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయానికి శనివారం విచ్చేసిన విద్యార్థులతో పుస్తకాలు, కథలు చదివించడంతో పాటు పుస్తక పఠనం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. జూన్ 7వ తేదీ వరకు ఈ వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని, ప్రతిరోజూ వస్తున్న చిన్నారులకు విద్యా సంబంధిత అంశాలను నేర్పించడంతో పాటు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



నాగశర్మకు ఆర్థికసాయం అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ సర్జరీ చేయించుకున్న నిరుపేదకు 'మేమున్నాం' స్వచ్ఛంద సంస్థ ఆపన్న హస్తం అందించింది. విజయనగరం పట్టణానికి చెందిన గంటి భాస్కరనాగశర్మ పుట్టుకతో మూగవాడు. ఆయన తండ్రి కేటరింగ్ యూనిట్‌లో పనిచేస్తున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో నాగశర్మ తలకు తీవ్రగాయమైంది. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక సాయం అందించాలని దాతలను కోరారు. మేమున్నాం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు స్పందించి రూ.18వేలు ఆర్థిక సాయం అందజేశారు. మానవతా దృక్పదంతో మరింత మంది దాతలు ముందుకువచ్చి నాగశర్మ వైద్యానికి సాయం అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డోకి చంద్రశేఖర్, కె.సత్యనారాయణమూర్తి, సూరిబాబు, డి.శ్రీనివాస్, డి.భవ్య తదితరులు పాల్గొన్నారు.